క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



అంజూరు తారక శ్రీనివాసులను ఆహ్వానిస్తున్న చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జిల్లాలోని చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత స్వయంభు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులను చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి గురువారం ఆహ్వానించారు. అంజూరు శ్రీనివాసులు శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తామని తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి: పట్టణంలోని అమరావతి జూనియర్ కళాశాలలో గురువారం శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు పోక్సో చట్టంపై వివరించారు. 100, 1098, 112, 181, 108 నెంబర్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయసలహాల కోసం 15100కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గరికపాటి రమేష్, అరుణ్, ప్రిన్సిపాల్ రాజేష్, కల్పన, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మునిశేఖర్, విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో గురువారం యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 117వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్, మునెమ్మ, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సదుపాయం కోసం షికారీల నిరసన



వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు సమీపంలో గల శోత్రియ భూముల్లో ఏర్పాటు చేసుకున్న గుడిసెలకు విద్యుత్ సదుపాయం కల్పించాలంటూ షికారీలు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సుమారు 10ఏళ్లుగా నివాసం ఉంటున్నా అధికారులు సౌకర్యాలు కల్పించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకట్లోనే నివాసం ఉంటున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి సమస్యను నివేదిస్తానని తెలిపారు. వీరికి మద్దతుగా బీఎస్పీ మండల అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 14 గ్రామ సచివాలయాలలో పరిధిలో వలంటీర్లు, వైద్య సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పిస్తున్నారు. వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఇంటింటికీ వెళ్లి చెబుతున్నారు. వైద్య సిబ్బంది షుగర్, బీపీ పరీక్షలు చేసి టోకెన్లును అందజేస్తున్నారు. ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు.



ఇంటికెళ్లి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట



పిచ్చాటూరు: ఆస్పత్రి నూతన భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- ప్రభుత్వ విద్యాసంస్థలు 2019కి ముందు, ఇప్పుడు ఎలా ఉన్నాయో ఒకసారి గమనించండి
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- రూ.50 లక్షలతో నిర్మించనున్న ప్రజారోగ్య భవనానికి భూమిపూజ

పిచ్చాటూరు: రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ప్రజా ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కీలకమైన విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై సీఎం జగనన్న దృష్టి సారించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం వెచ్చించనంతగా నిధు లను కేటాయించి ఈ రెండు రంగాలను బలంగా అభివృద్ధి చేశారన్నారు. నాడు-నేడు పథకం ద్వా రా స్కూళ్లు, కళాశాలలు, వైద్యశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడంతో పాటు అదనపు భవనాలు నిర్మిస్తున్నారని చెప్పారు. 2019 ఏడా దికి ముందు ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను ఇప్పుడు వాటి పరిస్థితిని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. వీటితో పాటు ప్రభుత్వ వైద్యశాలల్లో కొరత ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను దాదాపు భర్తీ చేశారన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇక 90 శాతం పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి దీటుగా రూపుదిద్దుకున్నట్లు ఆయన వివరించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిత్యం పరితపించే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని 2024లో మళ్లీ ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చలపతి రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ హమీద్, పీఐయూ డీఈఈ ప్రభాకర్ రెడ్డి, తహసీల్దారు మధుసూదన్ రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, సీఐ సురేష్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, బేబి, శోభన్, సర్పంచ్ అన్నాదురై, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశులు, నాయకులు పాలపద్మనాభం, మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, గోపాల్ రెడ్డి, మోహన్, బాబు రెడ్డి, చెంగల్రాయ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆయన గురువారం మండలంలోని శ్రీకాళహస్తి-తడ రోడ్డు నుంచి జంబుగోళం వరకు ఏఎంసీ 2022-23 నిధులు రూ.75 లక్షలతో చేపట్టనున్న రోడ్డు పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలను రూ.3 కోట్లు, 14 రైతు భరోసా కేంద్రాలను రూ.2.50 కోట్లు, 9 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల కోసం రూ.1.5 కోట్లు, నాడు-నేడులో స్కూళ్ల అభివృద్ధికి రూ.8 కోట్లు, సీసీ రోడ్లు రూ.5 కోట్లకు పైగా, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేయడం జరిగిందన్నారు. రూ.3 కోట్లతో గ్రామాలకు వెళ్లడానికి తారురోడ్లు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అరణి విద్యానాథరెడ్డి, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, అజయ్‌కుమార్ రెడ్డి, హరిబాబు, భాస్కర్‌రెడ్డి, ఇమామ్‌బాషా, కృష్ణయ్య, ధర్మయ్య, ఎంపీటీసీ సభ్యులు పుట్టయ్య, రవి, డీఈ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన నేతలకు ఎమ్మెల్యే పరామర్శ



గాయపడిన నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం పరామర్శించారు. మండలంలోని వేంబాక్కం ఎంపీటీసీ సభ్యుడు రాజా, వైఎస్సార్ టీయూసీ మండల కన్వీనర్ ఏలుమలై, నాగలాపురం-2 సచివాలయ కన్వీనర్ దేశప్పన్ ఆధ్వర్యంలో పిచ్చాటూరులో ఆస్పత్రి భవన భూమిపూజకు విచ్చేసిన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొనేందుకు బైక్‌పై వస్తుండగా స్థానిక జీబీఆర్ పాఠశాల సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజా, దేశప్పన్, ఏలుమలై ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే పిచ్చాటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న రాజ, దేశప్పన్, ఏలుమలైని పరామర్శించారు. బాధితులకు మెరుగైన విద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు.

భగత్ సింగ్ కాలనీ దాహార్తి తీర్చాలి

శ్రీకాళహస్తి: మండలం రామాపురం పంచాయతీ భగత్ సింగ్ కాలనీ దళితులకు దాహార్తి తీర్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి మండల కార్యాలయం ముందు గురువారం జనమాల గురవయ్య ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎంపీడీవో రఫీ ఖాన్ వారితో చర్చించి సమస్య పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నాగలాపురం: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న ల్యాబ్ భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సత్యవేడు నియోజకవర్గం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అపరంజిరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ సుధా చిన్నదొరై, ఎంపీపీ సింధూ శ్యామ్, వైస్ ఎంపీపీ కుమారి ఉదయ్ కుమార్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, ఎంపీపీ జాయిస్ ధానవేల్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.ఎం.సురేష్, వైస్ సర్పంచ్ సునిత, ఎంపీడీఓ పీకేఎం బాబు, ఎంఈఓలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ విజయసాయిరెడ్డికి ఘనస్వాగతం



విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

రేణిగుంట: వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డికి గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. తిరుపతి పర్యటన నిమిత్తం వచ్చిన ఆయనకు విమానాశ్రయంలో తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ సభ్యుడు సిపాయి సుబ్రమణ్యం, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందించి స్వాతగం పలికారు. విమానాశ్రయం వెలుపల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయల్దేరి వెళ్లారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, ఏర్పేడు మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, కూనాటి రమణయ్యయాదవ్, గంగారి రమే ష్, జువ్వల దయాకర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ప్రభాకర్, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచులు నగేషం, మునిశేఖర్‌రెడ్డి, ఎస్.శివయ్య, పెంచలయ్య, రహీం, ఖదీర్, గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద రోగికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యం పాలైన బాధితుడి కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి రూ.25,000 ఆర్థిక సాయం అందించారు. మండలంలో తొండమనాడు గ్రామం, ఎగువ వీధికి చెందిన పి.చెంగల్రాయులు కుమారుడు సుబ్రహ్మణ్యం గత కొద్ది రోజులుగా మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యం పాలయ్యారు. దీంతో వారి కుటుంబ పోషణ కూడా భారమైంది. వైద్య ఖర్చులకు వారి ఆర్థిక స్థోమత సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి వారి కుటుంబ పోషణకు, ఆస్పత్రి ఖర్చులకు రూ.25,000 అందజేసి దాతృత్వం చాటుకున్నారు.

ఘనంగా జాషువా జయంతి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలను నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు సంక్రాంతి రాజేంద్రుడు మాట్లాడుతూ గుర్రం జాషువా జీవిత విశేషాలు, రచనలు, ఖండకావ్యాలు, అంటరానితనం, మూఢ నమ్మకాలు, హేతువాదం, సాంఘిక దురాచారాల నిర్మూలనపై జాషువా కవిత్వాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వర్మ, పరంధాం, గంగారామ్, సుభాషిణి, సాయి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలిక మృతిపై సమగ్ర విచారణ జరపాలి

శ్రీకాళహస్తి: పెనుమూరు మండలానికి చెందిన బాలిక మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ బాలిక మరణం వెనుక ఆమెను వేధించిన యువకుల హస్తం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఆమె మరణానికి కారకులైన వారు ఎంతటి వారైనా చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో వలంటీరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీ-ఏ 1, ఓసీ 3, ఓసీ మహిల 1, ఎస్సీ1 ఖాళీలకు అర్హులైన వారు అక్టోబరు 8వతేదీ లోపు సంబంధిత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పౌర్ణమి హారతులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతామందిరంలో వెలసిన శ్రీకృష్ణ భగవానుడికి గురువారం పౌర్ణమి హారతులు సమర్పించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. గీతా పారాయణం, భజనలు చేశారు. రాత్రి పవలింపు సేవా కార్యక్రమం నిర్వహించారు.

గిరిజనుల తాగునీటి సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గ్రామపంచాయతీ పరిధిలోని సెల్లంవారి గిరిజన కాలనీలో బోరు మోటారుకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణతో గిరిజనుల తాగునీటి సమస్య పరిష్కారమైంది. గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన గిరిజన కాలనీలో తాగునీటి ఇక్కట్లు కథనంపై ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ వైర్లను సిబ్బందితో మరమ్మతులు చేయించారు. దీంతో తాగునీటి అవసరాల కోసం వేసిన బోరు మోటారు పని చేయడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. దీంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు.



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వేడుకగా సహస్ర సిద్ధి గణపతి హోమం

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద బీసీ కాలనీలో గురువారం సహస్ర సిద్ధి గణపతి హోమం, పూజలు వేడుకగా జరిగాయి. ఆలయాన్ని నూతనంగా నిర్మించి 11 రోజుల పాటు వివిధ రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. చివరి రోజు గురువారం 1008 లడ్డూలతో గణపతికి అభిషేకం, హోమం, విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నాగరాజురెడ్డి, మునిరాజా, నాయకులు హేమాద్రి, త్రివిక్రమరావు, గురవారెడ్డి, లోకేష్, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విశేషాలంకరణలో సహస్ర సిద్ధి గణపతి

పశువైద్య శిబిరం విజయవంతం



చైతన్యపురంలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్య నిపుణులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ చైతన్యపురంలో గురువారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ డైరెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. రేణిగుంట మండల పశువైద్యాధికారి స్రవంతి, కేవీకే పశువైద్య శాస్త్రవేత్త అనూష పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు, రాస్ మహిళా జ్యోతి ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, గిరిప్రసాద్, ఇందుమతి, శంకరయ్య, స్వాతి, నాగమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గంగ ఒడికి గణనాథుడు

తిరుపతి గాంధీ రోడ్: తిరుపతి నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని గురువారం అంగరంగ వైభవంగా నిమజ్జనం చేశారు. 11 రోజులు ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుని శోభాయాత్ర ఘనంగా సాగింది. ఇందులో జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, టీటీడీ సీవీఎస్‌వో నరసింహ కిషోర్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీ లు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

పాకాల : స్థానిక సంతగేటు వద్ద ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహాన్ని గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వినా యకుని వద్ద ఏర్పాటు చేసిన 10 కేజీల లడ్డూను వేలం వేశారు. ఆనంద ఫ్యాన్సీ స్టోర్ యజమాని భానుప్రకాష్ వేలంలో పాల్గొని రూ.33,500లకు లడ్డూ, అలాగే బంగారు నాణేన్ని రూ.13,500 లకు, వెండి నాణేన్ని రూ.3000లకు దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవగురునాథం, ఎస్.మురళి, ఎస్.ఉమామహేశ్వరన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చిన సీఎం జగనన్న





రాచర్లలో జగనన్న ఇంటిని ప్రారంభిస్తున్న మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, గృహ లబ్ధిదారులకు వస్త్రాలు అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ గిరిప్రసాద్

వరదయ్యపాళెం: మండలంలోని రాచర్ల జగనన్న కాలనీల్లో గురువారం ఉదయం గృహప్రవేశాలు చేశారు. స్థానిక సచివాలయ కన్వీనర్ గిరిప్రసాద్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి నూతన గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ముఖ్యమంత్రి జగనన్న ఆశయాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. సీఎం జగనన్న పేదలకు సొంతింటి కలను కల సాకారం చేశారన్నారు. ప్రతి లబ్ధిదారు కృతజ్ఞతగా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు విభాగం అధ్యక్షుడు మురళీ నాయుడు, సచివాలయ కన్వీనర్ మాధవయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సునీల్, నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ శివాయాదవ్, సీనియర్ నాయకులు భూషణం, మునస్వామి, సురేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు

కేవీబీపురం: ఫారెస్టు అధికారులు తమపై దాడి చేసి కులం పేరుతో దూషించారని తిమ్మసముద్రం గ్రామంలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పెరిందేశం గ్రామానికి చెందిన బి.రమేష్, వి.రాజా తిమ్మసముద్రం పంచాయతీలో ఉన్న ఓ ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆ సంస్థ డెవలప్‌మెంట్ పేరుతో అక్కడ ఉన్న చెత్తాచెదారాలను రిజర్వు ఫారెస్టులో తెలియక వేశారు. దీనిపై ఫారెస్టు అధికారులు వారిని నిలదీశారు. సమాచారం అందుకున్న యజమాని అక్కడికి చేరుకుని అక్కడ ఉన్న వ్యర్థాలను త్వరలోనే తీసివేస్తామని ఫారెస్టు అధికారులకు తెలిపారు. అయితే ఫారెస్టు సిబ్బంది తమపై దురుసుగా ప్రవర్తించడంతో తాము ప్రతిఘటించామని, అయితే వారు తమపై దాడి చేశారన్నారు. అంతటితో ఆగకుండా తమ గ్రామం పేరు చెప్పి తమను కులం పేరుతో దూషించారని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.